

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 18.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 148 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం






- దేశప్రయోజనాల కోసం మోదీకి అండగా నిలవాలి
- మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్
- నదుల అనుసంధానం ప్రధాని మోదీతోనే సాధ్యం
- వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్‌లో సీఎం చంద్రబాబు
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు.. 'వెరీ వెల్'

**వారణాసి, సెప్టెంబర్ 17 (జర్నలిస్ట్ ఫైల్):** "రైట్ టైమ్.. రైట్ లీడర్ నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలవాలి. ఎన్డీఏ ఐక్యతే దేశానికి బలం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాశీ-వాద్నగర్ సేవా యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే మోదీ నాయకత్వంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందనే విషయాన్ని చెప్పారు. ఇక ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువలేమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాశీ క్షేత్రం ప్రధాని నరేంద్ర మోదీ కర్మ భూమి. కాశీ పుణ్యక్షేత్రం నుంచి నరేంద్ర మోదీ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలు వారణాసికి నేతను ఎన్నుకోవడమే కాదు... దేశానికి ఓ లీడర్‌ను అందించారు. ప్రధాని నరేంద్ర మోదీ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుస్తున్నారు. వీకేఎస్ అనేది అభివృద్ధి మంత్రం... ఈ మంత్రంతో దేశం అభివృద్ధి చెందుతోంది. V అంటే వాద్నగర్, K అంటే కాశీ, S అంటే సెప్టెంబర్. ప్రజలకు సేవ చేస్తే.. దేశానికి సేవ చేయడమేనని ప్రధాని నరేంద్ర మోదీ నమ్ముతారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జేజేఎం, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి కోసం ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనేది ప్రధాని కల. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు... ఈ అంకెలు వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారు... ఇందులో ఎలాంటి మధ్యవర్తులు లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదును జమ చేస్తున్నారు."అని ముఖ్యమంత్రి అన్నారు.

**కోవిడ్ వ్యాక్సిన్ తో 140 కోట్ల ప్రజలను కాపాడారు:** "ప్రపంచంలోని వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న సందర్భంలో నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారు. 140 కోట్ల మంది భారతీయులను కాపాడారు... వారికి ఇబ్బందులు కలగకుండా చేశారు. 200 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించిన ప్రధాని నరేంద్ర మోదీ కరోనా బారి నుంచి ప్రజలను కాపాడారు. 101 దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. విశ్వ మానవాళి సంక్షేమం కోసం డబ్బులు గురించి ఎలాంటి ఆలోచన చేయకుండా కోవిడ్ వ్యాక్సిన్లను నరేంద్ర మోదీ ఉచితంగా వివిధ దేశాలకు అందించారు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ ఇలాంటి విధానాలతో మేకిన్ ఇండియా కాన్సెప్ట్ బలోపేతం అయ్యేలా చేశారు. గతంలో డిఫెన్స్ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. మిగతా 3లో...



## నమో- జయీభవ విజయీభవ

- ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా ఆశీర్వాద దీపం వెలిగించిన మంత్రి నారా లోకేష్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచమంతా వికసిత్ భారత్ వైపు చూసేలా అభివృద్ధి,సంక్షేమం,సాధికారత, సుస్థిరతతో పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహించారు. మన దేశాన్ని అభివృద్ధిలో ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా నిలిపే శక్తియుక్తులన్నీ మోదీ గారికి దేవుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ.. 'ఆశీర్వాద్ కా దియా' (ఆశీర్వాద దీపం) వెలిగించారు. అందరి ఆశీస్సులతో ప్రధాని మోదీ వందేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మిగతా 2లో...

## సేవే లక్ష్యంగా.. 2,600 వైద్య శిబిరాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా సేవా కార్యక్రమాలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం, 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా ప్రాథమికంగా రాష్ట్రంలో 2,600 వైద్య శిబిరాలను ప్రారంభించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, అవసరమైన వారికి వైద్య సలహా, చికిత్స అందించడం, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించి తదుపరి వైద్యం అందేలా చూడటమే ఈ శిబిరాల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. క్రమంగా రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, చికిత్స అవసరమైన వారిని గుర్తించి నిరంతర వైద్య సంరక్షణ అందేలా చూడటానికి మిగతా 2లో...



## హజ్ యాత్రకు మహిళలకు 500 సీట్లు

- 'మెహ్రాం' విభాగంలో ప్రత్యేక కేటాయింపు
- ఈనెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 7 వరకు గడువు: మంత్రి ఎన్ఎండీ ఫరూక్

2లో

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

- ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు: ప్రధాని మోదీ
- చిప్ తయారీకి అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఇప్పటికే 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం
- మిషన్ 2.0 కేటాయింపులు 8 నుంచి 13.5 బిలియన్ డాలర్లకు పెంపు




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** సెమీకండక్టర్ రంగంలో భారత్ శరవేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ చిప్ తయారీ రంగంలో కొత్త, విశ్వసనీయ కేంద్రాల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదిగేందుకు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. సెమీకండక్టర్ వ్యవస్థ విస్తరించడం ద్వారా ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఉపాధి, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. దిల్లీలో గురువారం ప్రారంభమైన సెమీకాన్ ఇండియా-2026 ఐదో ఎడిషన్‌లో ప్రధాని ప్రసంగించారు.

**చిప్ తయారీకి ప్రాధాన్య కేంద్రం :** ప్రపంచవ్యాప్తంగా చిప్ తయారీకి కొత్త, నమ్మకమైన ప్రాంతాల కోసం అన్వేషణ సాగుతోందని మోదీ చెప్పారు. భారత్‌ను కీలక తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన విధానాలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందన్నారు. దేశంలో ఇప్పటికే 12 సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని వెల్లడించారు.

చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా.. తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని విభాగాలను అనుసంధానించి సమగ్ర సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

**మిషన్ 2.0కు భారీ కేటాయింపులు :** భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వ కేటాయింపులను భారీగా పెంచినట్లు ప్రధాని తెలిపారు. తొలి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మిగతా 3లో...

## 19న విశాఖలో ఇళ్ల పట్టాల పండుగ



- ఒకేసారి 25,880 కుటుంబాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ
- త్వరలో విజయవాడలోనూ 24 వేల కుటుంబాలకు హక్కుల కల్పన
- జీవో నెంబర్ 30 ద్వారా ఇప్పటికే 12 వేల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ
- ఒక్క మంగళగిరిలోనే 5 వేల కుటుంబాలకు లబ్ది
- పేద ప్రజల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి మరో నిదర్శనం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని

2లో

## మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ దిశగా దేశం



- ప్రధాని 76వ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆశీర్వాద దీపోత్సవం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** పేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగిన నరేంద్ర మోదీ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. 2014లో తొలిసారిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. మిగతా 2లో...

## టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్



**ముంబయి (జర్నలిస్ట్ ఫైల్) :** టాటా గ్రూప్ మాతృసంస్థ టాటా సన్స్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించేందుకు బోర్డు మెజారిటీతో ఆమోదం తెలిపింది. ఆయన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. మరోసారి పదవిని చేపట్టబోనని గతంలో చంద్రశేఖరన్ ప్రకటించినప్పటికీ.. బోర్డు నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ పునఃపరిశీలించాలని కోరడంతో నిర్ణయం మారింది. మిగతా 2లో...

## సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు భరోసా

- డ్వాక్రా మహిళల ఆర్థిక పురోగతి, జీవనోపాధుల విస్తరణే లక్ష్యం
- బ్యాంకు రుణాలు, బీమా రక్షణపై మంత్రి కొండపల్లి సమీక్ష




**విజయవాడ, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయవాడలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,02,009 ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.15,054 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు అధికారులు మంత్రికి సూచించగా... నిర్దేశించుకున్న రూ.36,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా బ్యాంకర్లతో సమన్వయం పెంచాలని మంత్రి ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ.4,800 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు మంజూరు చేసే క్యాష్ క్రెడిట్ రుణాలపై ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇన్‌స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించాలని... గ్రామీణ సభలు, సమాఖ్యల నెలవారీ సమావేశాల అజెండాలో ఈ అంశాన్ని చేర్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మిగతా 2లో...

## నమో- జయీభవ ..విజయీభవ



(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలో దేశంలో మౌలిక సదుపాయాల కల్పన ఒక యజ్ఞంలా సాగుతోందని మంత్రి ప్రశంసించారు. సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ (అందరి భాగస్వామ్యంతో అందరి అభివృద్ధి) అనే నినాదంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేస్తున్నారని లోకేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు మహిళలకు 500 సీట్లు



**అమరావతి, సెప్టెంబరు17 (జర్నలిస్ట్ ఫైల్):** హజ్–2027 యాత్రకు సంబంధించి మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఏర్పాట్లను పూర్తి చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మెహ్రం విభాగం కింద 500 హజ్ సీట్లనుకేటాయించేందుకు అవకాశం కల్పించించినట్లు గురువారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మెహ్రం తోడుగా హజ్ యాత్రకు వెళ్లాలనుకున్నప్పటికీ, పాస్‌పోర్ట్ లేదా ఇతర కారణాల వల్ల గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హత కలిగిన మహిళా యాత్రికులకు ఈ ప్రత్యేక కేటగిరీ ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అవుతుందని తెలిపారు. అక్టోబర్ 7వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ తుది గడువుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించిందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా యాత్రికులు ఒఒఒ.ఫ్ణుయ-ఒశీఎఒవవ.ఫ్రశీఒ.ఉఅ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులందరూ హజ్–2027 యాత్రకు సంబంధించిన నిబంధనలు,అర్హతలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ అవకాశాన్ని రాష్ట్రానికి చెందిన, అర్హత కలిగిన మహిళా హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

## టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వ్ బ్యాంక్ నిబంధనల నేపథ్యంలో టాటా సన్స్ లిస్టింగ్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సంస్థ ఎన్‌బీఎఫ్‌సీ నమోదు నుంచి తప్పుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని ఆర్‌బీఐ తిరస్కరించిన నేపథ్యంలో లిస్టింగ్ నిబంధనలను పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో టాటా సన్స్ బోర్డు లిస్టింగ్ ప్రక్రియపై ముందుకు సాగేందుకు నిర్ణయం తీసుకుంది.

చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించారు. బోర్డు సమావేశంలో ఆయన తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. టాటా ట్రస్ట్స్ ప్రకారం.. సంస్థ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని నిబంధనల నేపథ్యంలో ఈ పునర్నియామకం చట్టపరంగా చెల్లుబాటు కాదని అభ్యంతరం వ్యక్తం చేసింది.

టాటా సన్స్ లిస్టింగ్ విషయంలోనూ టాటా ట్రస్ట్స్ భిన్నవైఖరిని వ్యక్తం చేసింది. లిస్టింగ్‌కు తాము అంగీకరించలేదని, అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ట్రస్ట్స్ తెలిపింది. గతంలో టాటా సన్స్ బోర్డు సంస్థ అన్‌లిస్టెడ్‌గానే కొనసాగాలని నిర్ణయించిన విషయాన్ని కూడా ప్రస్తావించింది.

చంద్రశేఖరన్ పునర్నియామక తీర్మానానికి బోర్డులో మెజారిటీ మద్దతు లభించింది. దీంతో ఆయన మరో ఐదేళ్లపాటు టాటా సన్స్ నాయకత్వంలో కొనసాగనున్నారు. అయితే తాజా పరిణామాలు టాటా గ్రూప్ పాలనా వ్యవస్థలో భిన్నాభిప్రాయాలను మరోసారి తెరపైకి తెచ్చాయి.

చంద్రశేఖరన్ పునర్నియామకం, లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో టాటా గ్రూప్‌కు చెందిన పలు షేర్లు గురువారం లాభాల్లో ట్రేడయ్యాయి. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా మోటార్స్ తదితర షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది.

## సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు భరోసా




(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళకు 'ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', 'ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' పథకాల కింద బీమా రక్షణ కల్పించాలని.. జిల్లా సమాఖ్యల ఇన్సూరెన్స్ కాల్ సెంటర్ల ద్వారా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే 65 రకాల ఉత్పత్తులను విక్రయించడానికి 4 స్వయం బ్రాండ్ సిగ్నేచర్ స్టోర్ల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆధునిక లాండ్రీ, బ్యూటీ పార్లర్, హెయిర్ కటింగ్ వంటి వృత్తి నైపుణ్యాలలో మహిళలకు, చేతివృత్తిదారులకు శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో నడిచే కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా తక్కువ అద్దెకే రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచి, సాగు ఖర్చులు తగ్గించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా సెర్ప్ అధికారులు నిరంతరం శ్రమించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# మా రోడ్లు... మా ఇష్టం!

- నవులూరులో రహదారి స్థలాల ఆక్రమణలపై ఆరోపణలు
- అధికార, రాజకీయ అండదండలతోనే అక్రమ నిర్మాణాలంటున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- రోడ్లు హద్దులు తేల్చాల్సిందే
- ప్రధాన రహదారి 100 అభివృద్ధి కలేనా ?



నవులూరు మక్కెవారిపేటలో ప్రధాన రహదారి పై వాగు స్థలంలో అక్రమంగా ఉత్తరం వైపుదారి లేకుండా రోడ్డుకు అడ్డంగా కట్టిన భవనం,




40 అడుగుల రోడ్డును అక్రమణ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతి పరిధిలోని నవులూరు గ్రామంలో రహదారి స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లను ఆనుకుని తాత్కాలిక నివాసాలతోపాటు శాశ్వత నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, వాగు స్థలాలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. నవులూరు రైల్వే గేటు నుంచి గోలి వారి తోట, మక్కెవారి పేట, వాటర్ ట్యాంక్, క్రికెట్ స్టేడియం రోడ్డు వరకు పలు ప్రాంతాల్లో రహదారి స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు స్థానిక రాజకీయ నాయకులు, రౌడీషీటర్ల అండదండలతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల వివరణ రావాల్సి ఉంది.

**కుచించుకుపోతున్న రహదారులు :** ఆక్రమణలతో పలు రహదారులు ఇరుకుగా మారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా కోతుల చెట్టు నుంచి ఎన్టీఆర్ కాలనీ, మక్కెవారి పేట మీదుగా గోలి వారి తోట వైపు వెళ్లే మార్గంలో సుమారు 40 అడుగుల రహదారి ఆక్రమణలకు గురైందని చెబుతున్నారు.

**రోడ్డు హద్దులు తేల్చాల్సిందే :** ప్రభుత్వ రికార్డుల ప్రకారం రహదారి విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఉన్న వెడల్పు ఎంత? నిర్మాణాలు రహదారి హద్దుల్లో ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**సమాధుల రోడ్డుపైనా వివాదం :** సమాధుల రోడ్డు స్థలాన్ని ఆక్రమించేందుకు ఇటీవల ప్రయత్నం జరగగా సిబ్బంది అడ్డుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సిబ్బందిపై దాడికి యత్నించినట్లు కూడా ఆరోపిస్తున్నారు. అలాగే 40 అడుగుల రహదారిపై ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన కాంట్రాక్ట్ సిబ్బందికి ఇబ్బందులు ఎదురైనట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటనలపై అధికారిక విచారణ జరపాలని కోరుతున్నారు.

**ఆక్రమణలో ప్రత్యామ్నాయ మార్గం :** నవులూరు ఎస్టీ కాలనీ, అబద్దయ్య కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, మక్కెవారి పేట వాసులకు గోలి వారి తోట వైపు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారి ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ మార్గం కూడా ఆక్రమణలకు గురికావడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని అంటున్నారు.

**100 అడుగుల రహదారి ప్రతిపాదన ఏమైంది? :** నవులూరు రైల్వే గేటు నుంచి స్టేడియం రోడ్డు, వాటర్ ట్యాంక్ వరకు గతంలో 120 అడుగుల రహదారి ప్రతిపాదన ఉన్నట్లు స్థానికులు గుర్తుచేస్తున్నారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో 100 అడుగుల రహదారికి మార్కింగ్ చేసినట్లు చెబుతున్నారు. అయితే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదని, దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**ఫ్లై ఓవర్‌తో పెరగనున్న రాకపోకలు :** నిడమర్రు రోడ్డు ఫ్లై ఓవర్ నిర్మాణంతో నవులూరు మీదుగా రాకపోకలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఆక్రమణలతో రహదారి వెడల్పు తగ్గిన నేపథ్యంలో భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**100 అడుగులకు విస్తరించాలి :** నవులూరు రహదారులపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలాలు, రహదారి హద్దులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్ రాజధాని అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారిని 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని మంత్రి నారా లోకేష్‌ను కోరుతున్నారు. రహదారి స్థలాలను ఇప్పటికైనా పరిరక్షించకపోతే భవిష్యత్‌లో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

## సేవే లక్ష్యంగా.. 2,600 వైద్య శిబిరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ శిబిరాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. మోదీ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు సేవ చేయడం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలో తొలి వైద్య శిబిరాన్ని గురువారం కృష్ణా జిల్లా గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

**దశలవారీగా 60 ఆసుపత్రుల ఉన్నతీకరణ :** గ్రామస్థాయి నుంచే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద కుటుంబాలకు వైద్య రక్షణ కల్పించడంతో పాటు వృద్ధులకు కూడా ఆరోగ్య భద్రతను విస్తరించారని చెప్పారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, అవసరమైన వారికి చికిత్స అందించడం, తదుపరి వైద్య సేవలను కొనసాగించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు.

రాష్ట్రంలో 60 ఆసుపత్రుల ఉన్నతీకరణకు ప్రతిపాదనలు అందాయని మంత్రి చెప్పారు. గన్నవరం ఏరియా ఆసుపత్రిలో వచ్చే బడ్జెట్‌లో ట్రామా కేర్, డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**సేవా భావంతోనే జన్మదిన వేడుకలు :** ప్రధానమంత్రి జన్మదిన వేడుకలను కేవలం ఉత్సవాలకు పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం మంచి సంప్రదాయమని మంత్రి అన్నారు. వైద్య శిబిరాలతో పాటు రక్తదానం, ఆరోగ్య అవగాహన, ఇతర ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం పనిచేయడమే నిజమైన ప్రజా సేవ అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

**కూటమి ప్రభుత్వాల సమన్వయంతో.. :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

కేంద్రం అందిస్తున్న సహకారాన్ని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**పేదల సంక్షేమమే ధ్యేయంగా.. :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో అడుగుపెట్టిన నాటి నుంచి పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి నేరుగా అందేలా చర్యలు చేపట్టారని చెప్పారు. పారదర్శక పాలనతో పాటు దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారని వివరించారు.

**'స్త్రీ శక్తి' పథకంతో ఆసుపత్రుల్లో పెరిగిన ఓపీ :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కుటుంబాలను బలోపేతం చేయడానికి మార్గమని భావించి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, రుణ సదుపాయాల ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి కనీస మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు.

రాష్ట్రంలో అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం (ఉచిత బస్సు ప్రయాణం) ద్వారా మహిళలకు అందుతున్న ప్రయోజనాలతో ఆసుపత్రుల్లో ఓపీ కూడా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు, ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, వైద్య శిబిరాల నిర్వహణ రాష్ట్ర పర్యవేక్షకుడు డాక్టర్ సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భీమవరంలో ఘనంగా ఆశీర్వాద దీపోత్సవం



**భీమవరం (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భీమవరంలో నిర్వహించిన 'ఆశీర్వాద దీపోత్సవం' కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాలు వెలిగించి ప్రధానమంత్రి మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగిస్తూ మోదీకి తమ ఆశీర్వాదాలు అందించారు.

## 19న విశాఖలో ఇళ్ల పట్టాల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం విశాఖ జిల్లాలో ఒకేరోజు 25,880 పేద కుటుంబాల జీవితాల్లో సంతోషం నింపుతోంది. ఈనెల 19వ తేదీన విశాఖలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు నిర్మించుకున్న 25,880 కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేయనున్నారు. ప్రతి ఒక్కరికి కూడు,గుడ్డ, నీడ తప్పనిసరిగా ఉండాలన్న టీడీపీ సిద్ధాంతానికి అనుగుణంగా 2024లో ఆంధ్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వివిధ ప్రభుత్వ స్థలాల్లో అభ్యంతరం లేని ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు హక్కులను కల్పించేలా వివిధ రకాల జీవోలను జారీ చేసింది. ఆ జీవోల అమల్లో భాగంగా ఒక్క విశాఖ జిల్లాలోనే 11 మండలాల్లో 25,880 మందికి వారి ఆస్తులపై పూర్తి హక్కులు కల్పిస్తున్నారు. అదే విధంగా రానున్న కాలంలో విజయవాడలోనూ 24 వేల మంది కుటుంబాలకు ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయనున్నారు. ఇప్పటికే జీవో నెంబర్ 30 ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 12 వేల మందికి వారి ఇంటి స్థలాలపై హక్కులు కల్పించారు. మరో 9 వేల దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా వాటిని కూడా వీలైనంత త్వరగా పరిష్కరించనున్నారు. యువ మంత్రి లోకేష్ చొరవతో ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 5 వేల కుటుంబాలకు పట్టాలను రెగ్యులరైజ్ చేశారు. విశాఖలో 25,880 మందికి దాదాపు 400



ఎకరాల్లో విస్తరించిన ఉన్న ఇళ్ళ పట్టాలను రెగ్యులరైజ్ చేస్తున్నారు. విశాఖలో జీవో నెంబర్ 296 కింద 22,326 ఇళ్ల స్థలాలకు, జీవో నెంబర్ 388 కింద 613 మందికి, జీవో నెంబర్ 84 కింద 156 మందికి, జీవో నెంబర్ 30 కింద 1842 మందికి, జీవో నెంబర్ 45 కింద 943 మందికి హక్కులు కల్పిస్తున్నారు. విశాఖ రూరల్ మండలంలో అత్యధికంగా 8074 మందికి, ములగాడ మండలంలో 4213 మందికి, గాజువాక మండలంలో 3999 మందికి, గోపాల పట్నం మండలంలో 2,956 మందికి, పెందుర్తి మండలంలో 2,736 కుటుంబాలకు, పెద గంట్యాడ మండలంలో 1694 మందికి, మహరాణిపేట మండలంలో 1228 కుటుంబాలకు మేలు జరుగుతోంది.

**ప్రతి కుటుంబానికీ ఇళ్లు: మంత్రి అనగాని :** రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా ఇళ్లు లేకుండా ఉండకూడదనేది తమ కూటమి ప్రభుత్వ విధానమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అందులో భాగంగానే అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు పేదలకు ఉచితంగా స్థలం కేటాయిస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు వివిధ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న కుటుంబాలకు వారి ఆస్తిపై హక్కులు కల్పిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం భూమిని అసైన్ చేసి 10 ఏళ్లు దాటితే అటువంటి స్థలాలకు కూడా పూర్తి హక్కులు కల్పిస్తున్నామన్నారు. అలాగే గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలను కూడా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించామన్నారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా క్రమబద్ధీకరణ చేస్తున్నామన్నారు. పేదవాడికి పూర్తి హక్కులతో ఇళ్లు అనే కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం పేద ప్రజల ఆశలు, ఆకాంక్షలతో ఆటలాడుకుందని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామనే పేరుతొ వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందని అన్నారు. తీరా పేదలకు ఇచ్చిన సెంటు, సెంటున్నర స్థలం కూడా నివాసానికి పనికి రానిది ఇచ్చారని విమర్శించారు. పేదల జీవితాల్లో వెలుగు నింపేలా వారు నిర్మించుకున్న ఇళ్లకు హక్కులు కల్పించాలనే కనీస ఆలోచన కూడా గత ప్రభుత్వం ప్రభుత్వం చేయలేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు.

## మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ దిశగా దేశం



(మొదటి పేజీ తరువాయి)

నవభారత నిర్మాణం కోసం మోదీ ఎనలేని కృషి చేస్తున్నారని, ప్రపంచ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశ శక్తిసామర్థ్యాలను చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయని అన్నారు.

హిందుత్వం దేశానికి శరణమని పేర్కొన్న మాధవ్, భారతదేశాన్ని వసుధైక కుటుంబంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. దేశం దేదీప్యమానంగా వెలుగొందుతోందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని మోదీ ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా, ఆయన 76వ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆశీర్వాద దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోదీ పిలుపుతో ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్ల నుంచి బయటకు వచ్చి దీపాలు వెలిగిస్తున్నారని పేర్కొన్నారు.

తిరుపతిలోని కోదండరామాలయం వద్ద నిర్వహించిన ఆశీర్వాద దీపోత్సవంలో పీవీఎన్ మాధవ్ దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని దీపాలు వెలిగించారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మోదీ చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాద దీపోత్సవాన్ని నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.



# ప్రజా సేవలో మోదీ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

## కనకదుర్గమ్మ ఫ్లైఓవర్‌పై 'ఆశీర్వాద దీపోత్సవం'

## దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే సంకల్పం నెరవేరాలి

### మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్న మంత్రి సత్యకుమార్







**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, ప్రజా సేవకు అంకితమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలో 'ఆశీర్వాద దీపోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం దుర్గాఘాట్‌లో కృష్ణానదికి హారతి ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా కనకదుర్గమ్మ తల్లి ఆయనకు ఆయురారోగ్యాలు, శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. దేశాన్ని వికసిత్ భారత్‌గా నిర్మించాలన్న మోదీ సంకల్పం నెరవేరేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

మోదీ ప్రజా సేవా ప్రయాణం సేవాభావం, సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, ఆత్మనిర్భరతకు ప్రతీకగా నిలిచిందని చెప్పారు. పేదల కోసం ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, జనధన్, బీమా పథకాలు, పీఎం కిసాన్, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. డీబీటీ విధానం ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తూ పారదర్శకతను పెంచారని పేర్కొన్నారు.

ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతలో నైపుణ్యం, స్వయం ఉపాధి, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా రహదారులు, రైల్వేలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, వంతెనలు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు.

విజయవాడలో కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణంతో నగర ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, పోలవరం, రైల్వే జోన్, జాతీయ విద్యాసంస్థలు, పరిశ్రమలు, రక్షణ, డ్రోన్, సౌర విద్యుత్ రంగాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధికి అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన, వైద్య శిబిరాలు, మొక్కలు నాటడం, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా 'సేవా సేతు' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

'అధికారం కోసం కాదు.. సేవ కోసం' అనే స్ఫూర్తితో మోదీ ప్రజా జీవితాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి అన్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో ప్రజలు, యువత, పార్టీ కార్యకర్తలు, సేవా సంస్థలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. 'ఆశీర్వాద దీపోత్సవం' కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని వికసిత్ భారత్ నిర్మాణం కోసం మోదీ చేస్తున్న కృషికి తమ ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇన్‌ఛార్జి నార్ని తాతాజీ, రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్, బీజేపీ నాయకులు కరినాగలక్ష్మి, రవీంద్రరెడ్డి, మువ్వల సుబ్బయ్య, లాకా వెంగళరావు, బొమ్మదేవర రత్నకుమారి, షర్మిళ, స్వాతిరావు, కోలపల్లి గణేష్, పిట్టల గోవిందు, చైతన్య శర్మ, నామిశెట్టి వెంకట్, పోతంశెట్టి నాగేశ్వరరావు, పైలా సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండెక్టర్ టెక్నాలజీస్ వంటి వాటితో పాటు... రోబోటిక్స్ వంటి వాటిని ప్రధాని మోదీ అర్థం చేసుకోగలరు.. వాటి వల్ల యువతకు లబ్ది చేకూర్చగలరు. గతంలో యువత ఉద్యోగాల మీద ఆధారపడేవాళ్లు. కానీ ప్రధాని దూరదృష్టితో 2.20 లక్షల స్టార్టప్ ల ద్వారా యువతే ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకున్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత చేరారంటే దానికి ప్రధాని నరేంద్ర మోదీనే కారణం. అద్భుతమైన స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రధాని చేస్తున్న కృషి అపూర్వం.. భేటీ బచావో-భేటీ పడావో, లక్పతీ దీదీ వంటి పథకాలే దీనికి నిదర్శనం. ఉజ్వల పథకం క్లీన్ ఫ్యూయల్ అందిస్తుంది.. ముద్ర పథకం పెట్టుబడి సమకూరుస్తుంది.. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీ శక్తి అధినియం ద్వారా చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు.. ఇది గేమ్ ఛేంజర్ కాబోతోంది."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**తిరుగులేని శక్తిగా భారత్ :** "ప్రపంచం ముందు భారత్ ను తిరుగులేని శక్తిగా నిలబెడడానికి కారణం ప్రధాని మోదీ. ఇటీవలే బ్రిక్స్ సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహించారు. వివిధ దేశాల అధినేతలు మన ప్రధాని నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారు... ఆపరేషన్ సింధూర్ ద్వారా ధీటైన జవాబుతో భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ను నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను అభినందిస్తున్నాను. నేను కూడా వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు... వారికి నేనూ బాధితుణ్ణే. కానీ ఇప్పుడు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపారు... దటీజ్ నరేంద్ర మోదీ. దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదే. దేశంలో కనెక్టివిటీ పెంచారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలు దేశంలో ఉన్నాయి.. కానీ దేశాభివృద్ధి, ఆత్మనిర్భరత అనేదే మన లక్ష్యం. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుంది. సుస్థిరత వల్ల నమ్మకం పెరుగుతుంది.. నమ్మకం వల్ల పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులు వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి.. అభివృద్ధి జరుగుతుంది. ఉద్యోగాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రమే ఇంకా పెండింగులో ఉంది... ఈ నదుల అనుసంధానం



ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్ స్టాపబుల్. 25 ఏళ్ల పాటు కంటిన్యూగా పాలనలో ఉండడం మామూలు విషయం కాదు. దేశంలో.. ప్రపంచంలో కూడా ఈ విధంగా రాజ్యాంగ పదవిలో ఉండడం సాధ్యం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ సమాజాన్ని చదివారు... చాలా నేర్చుకున్నారు... దానికి అనుగుణంగా పాలన చేపట్టారు. 2003లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోదీ వైబ్రంట్ గుజరాత్ అనే కార్యక్రమం నిర్వహించారు.. ఇప్పుడది గ్లోబల్ బ్రాండ్ గా మారింది. నరేంద్ర మోదీ సారధ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు... గ్రామీణ ప్రాంతాలకు చేరింది. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ ఇదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**త్రేతాయుగం.... కలియుగం... :** "కోట్లాది భక్తులు మహా కుంభమేళాకు వారణాసి వచ్చారు. మహా కుంభమేళాను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అద్భుతంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పూర్తి చేశారు. కలగా ఉండే రామ మందిర నిర్మాణాన్ని నరేంద్ర మోదీ నిజం చేశారు. త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. వెంకన్న ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించాలి."అని సీఎం చంద్రబాబు యూపీ ముఖ్యమంత్రిని కోరారు.

**ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు :** సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించడంతో సభికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రసంగం మొత్తం సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగడంతో పలుమార్లు పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వినిపించాయి. రామజన్మభూమి నుంచి ఆపరేషన్ సింధూర్ వం-కు వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన వివరించారు. ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ... యే మేరేలియే గర్వ్ కా క్షణ్ హై అంటూ సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక ప్రసంగం మధ్య మధ్యన దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై, నయా భారత్ హై.... ఆత్మ నిర్భర్ భారత్ హై అంటూ వ్యాఖ్యానించారు. చివరిలో ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్, వికసిత్ భారత్... యహీ హమారా సంకల్ప్ హై అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి అతిథుల నుంచి ప్రశంసలు లభించాయి. తన ప్రసంగం ప్రారంభానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు... వెరీ వెల్.. వెరీ వెల్ అంటూ ప్రశంసించారు. చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లతో అభినందనలు తెలపాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన కుటుంబానికున్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన తండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు చంద్రబాబు అత్యంత సన్నిహితుడని, తన తండ్రి కష్టసుఖాల్లో ఆయనకు అండగా నిలిచారని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

**ప్రత్యేక పూజలు... :** వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాశీ విశ్వనాథుడిని కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాలతో కాశీ విశ్వేశ్వరుణ్ణి అభిషేకించారు. కాశీ విశ్వనాథుని ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ యాత్ర చేపడుతున్న వారికి కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ప్రసాదాన్ని పంచి పెట్టారు. సభ అనంతరం సేవా సంకల్ప్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

(మొదటి పేజీ తరువాయి)



సెమీకండక్టర్ రంగం విస్తరించడంతో కొత్త కంపెనీలు, పెట్టుబడులు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది కీలక అవకాశమని చెప్పారు.

**15 రోజుల్లోనే ఎన్నో మార్పులు :** దేశం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను పరిశీలిస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందని గుర్తుచేశారు.

అదే సమయంలో దేశంలో సుమారు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దీనివల్ల సరుకు రవాణా వేగం పెరగడంతో పాటు లాజిస్టిక్స్ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని చెప్పారు.

**భారత్‌పై ప్రపంచ విశ్వాసం పెరుగుతోంది :** ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా భారత్ తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తుండటంతో పాటు ప్రపంచ దేశాల్లో దేశంపై విశ్వాసం పెరుగుతోందన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని ప్రస్తావించారు.

తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను కీలక భాగస్వామిగా తీర్చిదిద్దడంలో సెమీకండక్టర్ రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందని మోదీ తెలిపారు.

**విశ్వకర్మ జయంతి రోజున సెమీకాన్ :** విశ్వకర్మ జయంతి రోజున సెమీకాన్ ఇండియా కార్యక్రమం జరగడం ప్రత్యేకమని ప్రధాని అన్నారు. భారత సంప్రదాయంలో విశ్వకర్మను సృష్టి, నిర్మాణానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. శతాబ్దాల నాటి నిర్మాణ సంప్రదాయానికి 21వ శతాబ్దపు సాంకేతికత, ఆలోచనలను జోడించడం ద్వారా ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ లక్ష్యాల వైపు ముందుకు సాగవచ్చని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు దిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో సెమీకాన్ ఇండియా-2026 జరుగుతోంది. 'సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ద ఎకోసిస్టమ్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ సెమీకండక్టర్ రంగానికి చెందిన కంపెనీలు, నిపుణులు, పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు.

# హెల్త్ కార్డుల వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు



- అక్టోబరు 1 నుంచి నిధుల లభ్యత
- పెండింగ్ వైద్య బిల్లుల చెల్లింపులు, సీలింగ్ పెంపుపై దృష్టి
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వంద శాతం గ్రాస్ వేతనం అమలు చేయాలి
- 32 ప్రధాన డిమాండ్లపై అధికారులతో ఫలప్రదమైన చర్చలు
- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్

**అమరావతి, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, హెల్త్ కార్డుల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రాబోయే రెండు, మూడు నెలల్లో సమగ్ర చర్యలు చేపట్టనున్నట్లు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్, రాష్ట్ర కార్యదర్శి డి.వి. రమణ పాల్గొని ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

హెల్త్ కార్డుల వ్యవస్థకు సంబంధించి ఉద్యోగుల నుంచి వసూలు చేసే మొత్తంతో పాటు ప్రభుత్వం అందించే సరిపోలిక నిధులను ఎలాంటి మధ్యంతర ఆటంకాలు లేకుండా నేరుగా ట్రస్టు ఖాతాలో జమ చేసే విధంగా ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు అక్టోబరు నుంచి చర్యలు ప్రారంభమవుతాయని విద్యాసాగర్ తెలిపారు. అక్టోబరు 1 నుంచి నిధులు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఆసుపత్రుల పెండింగ్ వైద్య బిల్లుల చెల్లింపులు, హెల్త్ కార్డుల పరిమితి పెంపు వంటి అంశాలపై చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాబోయే రెండు, మూడు నెలల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సమగ్రంగా సమీక్షించి ప్రక్షాళన చేయాలని, ఉద్యోగులకు పారదర్శకంగా, సులభతరంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సీపీఎస్ కింద పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు నేరుగా ఖజానా నుంచి వైద్య బిల్లుల పునఃచెల్లింపులు పొందేలా ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో అందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా త్వరగా విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగుల పదోన్నతులు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వంద శాతం గ్రాస్ వేతనం, బదిలీలు, ప్రయోగశాల సాంకేతిక నిపుణుల గ్రేడ్ పెంపు, ఎఫ్‌టీఏల మంజూరు తదితర 32 ప్రధాన డిమాండ్లపై అధికారులతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని విద్యాసాగర్ తెలిపారు. సుమారు 3,500 మంది వైద్య శాఖ కాంట్రాక్టు సిబ్బందికి వంద శాతం గ్రాస్ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రస్తుతం అమలు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా బదిలీల సౌకర్యం కల్పించే ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు చెప్పారు. 2014కు ముందు నియమితులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణ పూర్తయిందని, 2014 తర్వాత నియమితులై క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యను కూడా పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. వివిధ యాప్‌లలో సర్వేలు, వివరాల నమోదు కారణంగా ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించగా, వివిధ సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా ఒకే యాప్‌లో సమీకరించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారని వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సుల సమస్యలు, జీఓ నంబరు 143, 32 ఉత్తర్వుల అమలులో ఉన్న ఇబ్బందులను కూడా సమావేశం దృష్టికి తీసుకెళ్లి, వైద్య శాఖలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు విద్యాసాగర్ తెలిపారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాప ప్రసాద్, ఎస్టీయూ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హృదయ రాజు, పీఆర్టీయూ అధ్యక్షుడు కృష్ణయ్య, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నర్సుల సంఘం అధ్యక్షురాలు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి
- ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**వికారాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కే. లక్ష్మీనారాయణలతో కలిసి ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఆర్వోఆర్ అమలు, బ్యాక్‌లాగ్ పోస్టులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ. ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అధిక సంఖ్యలో పనిచేస్తున్న ఎస్సీ పారిశుద్ధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కల్పించాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ శాఖల్లోని ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను సేకరించి వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి, సబ్‌ప్లాన్ నిధులను కచ్చితంగా ఖర్చు చేయాలని, నిధుల వినియోగంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులను గుర్తించి సహకరించాలని సూచించారు. విబిజి రామ్‌జీ పథకం ద్వారా అంగన్‌వాడీ, మహిళా, గ్రామ పంచాయతీ, పాఠశాల భవనాలతో పాటు పాఠశాల ప్రహరీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డీఆర్డీవోను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద నమోదైన కేసులను వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని, ప్రతి కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో పౌర హక్కుల దినోత్సవాన్ని తప్పనిసరిగా నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కార్యక్రమాలకు పోలీసు, రెవెన్యూ అధికారులు, డీవీఎంసీ సభ్యులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు అందించాల్సిన నష్టపరిహారం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాల వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. నివేదికల ఆధారంగా బాధితులకు నష్టపరిహారం అందిస్తున్నామని, పౌర హక్కుల దినోత్సవాలను నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి ముందుగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీసుల గౌరవ వందనం స్వీకరించగా, కలెక్టర్, ఎస్పీ పూలగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్, కమిషన్ సభ్యులను జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు శాలువాలతో సత్కరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, అదనపు కలెక్టర్ వెంకటాచారి, డీఆర్వో స్వర్ణలత, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, డీవీఎంసీ సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, కిరణ్ రోనాల్డ్, మయూర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ అవార్డుకు దరఖాస్తులు

: డా.ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టర్



**హైదరాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2026 గ్లోబల్ ఐకాన్ టీచర్ అంతర్జాతీయ స్థాయి, డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 11న హైదరాబా ద్‌లో పుర స్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులతో పాటు సాంస్కృతిక, క్రీడా, కళలు, యోగా రంగాల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యా అర్హతలు, బోధన అనుభవం, సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికా క్లిప్పింగ్స్, గతంలో అందుకున్న అవార్డుల వివరాల జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి సెప్టెంబర్ 30లోపు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి, డోర్ నెం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రా బాద్-15 చిరునామాకు పంపించాలని కోరారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్ : 9652347297 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

### మణికొండ పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్‌లో మాదిరి ఎన్నికలు



**మణికొండ, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మణికొండ పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం మాదిరి ఎన్నికలను నిర్వహించారు. 2026--27 విద్యా సంవత్సరానికి పాఠశాల లీడర్ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 911 ఓట్లు పోలవగా, లీడర్ పదవుల కోసం 14 మంది విద్యార్థులు పోటీ చేశారు. వీరిలో 6 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారు. బాలికల విభాగంలో గొల్ల పవిత్ర 339 ఓట్లు సాధించి, బాలుర విభాగంలో గొల్ల చందు 336 ఓట్లతో విజయం సాధించారు. వీరిద్దరూ 2026--27 విద్యా సంవత్సరానికి పాఠశాల లీడర్లుగా ఎన్నికయ్యారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ఎన్నికల విధానం, ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ మాదిరి ఎన్నికలను నిర్వహించినట్లు పాఠశాల బృందం తెలిపింది. నిజమైన ఎన్నికల తరహాలో విద్యార్థులతో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై వారికి ప్రత్యక్ష అవగాహన కల్పించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీమతి వరలక్ష్మి, శ్రీ విజయ్‌కుమార్, శ్రీ కిషన్, శ్రీ సత్తయ్యలు పాఠశాల బృందం సహకారంతో సమర్థవంతంగా కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, వెంకటప్ప, శివరాం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లంపల్లిలో ఒకే ఇంటి నుంచి ఇద్దరు డాక్టర్లు!

- అక్కాచెల్లెళ్ల వరుస విజయాలు.. గ్రామీణ ప్రతిభకు అరుదైన గుర్తింపు
- రెండేళ్ల క్రితం హారిక.. తాజాగా జ్యోతిర్మయి.. కుటుంబంలో ఆనందోత్సాహం



**కడ్తాల్ సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ గడ్డపై పుట్టి.. వైద్య విద్యలో అడుగుపెట్టి.. తమ ప్రతిభతో కుటుంబానికే కాదు గ్రామానికి కూడా గర్వకారణంగా నిలిచారు ఆ అక్కాచెల్లెళ్లు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామానికి చెందిన గుర్క కుటుంబంలో వరుసగా ఇద్దరు కుమార్తెలు ఎంబీబీఎస్ మెడికల్ సీట్లు సాధించడం విశేషంగా నిలిచింది. రెండేళ్ల క్రితం అక్క గుర్క హారిక ఎంబీబీఎస్ సీటు సాధించగా.. తాజాగా చెల్లెలు గుర్క జ్యోతి ర్మయి సైతం ఎంబీబీఎస్ మెడికల్ సీటు సాధించి తన ప్రతి భను చాటుకుంది. గుర్క రామకృష్ణ, మంజుల దంపతుల కుమా ర్తె జ్యోతిర్మయి నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి పెంచుకుని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగిన జ్యోతిర్మయి తన కృషితో ఈ విజయాన్ని అందుకుంది. ఇదే కుటుంబానికి చెంది న పెద్ద కుమార్తె గుర్క హారిక కూడా రెండేళ్ల క్రితం వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మెడికల్ సీటు సాధిం చి వైద్య విద్యలో అడుగుపెట్టింది. ఇప్పుడు చెల్లెలు జ్యోతిర్మయి కూడా అదే బాటలో పయనించడంతో గుర్క కుటుంబం వైద్య విద్యలో అక్కాచెల్లెళ్ల విజయాలకు వేదికగా మారింది.



**గ్రామీణ ప్రతిభకు స్ఫూర్తి**

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు వసతులు, మార్గదర్శకత్వం వంటి అంశాల్లో కొన్ని సవాళ్లు ఎదురైనా.. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడి చదివే తత్వం ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని హారిక, జ్యోతిర్మయి విజయాలు చాటిచెబుతు న్నాయి. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు కుమార్తెలు వైద్య విద్యలో సీట్లు సాధించడం చల్లంపల్లి గ్రామ విద్యార్థులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తోంది. మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తే.. ఆ వెలుగు ఒక కుటుంబానికే పరిమితం కాదు.. సమాజానికంతా స్ఫూర్తినిస్తుంది. గుర్క అక్కాచెల్లెళ్ల విజయాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**తల్లిదండ్రుల ఆనందం**

తమ ఇద్దరు కుమార్తెలు వరుసగా ఎంబీబీఎస్ సీట్లు సాధించడంపై తల్లిదండ్రులు గుర్క రామకృష్ణ, మంజుల దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుకు సహకరించిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. హారిక, జ్యోతిర్మయి భవిష్యత్తులో వైద్యులుగా ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. గ్రామీణ గడ్డ నుంచి వైద్య రంగంలోకి అడుగుపెడుతున్న ఈ అక్కాచెల్లెళ్ల విజయగాథ.. చల్లంపల్లి పేరును మరింత ప్రత్యేకంగా నిలిపింది.

## 22ఏ భూముల సమస్యపై టీడీపీ వినతి



**శేర్లింగంపల్లి, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు సమస్యగా మారిన 22ఏ భూముల అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్టా వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. తాము 22ఏ నిబంధనకు వ్యతిరేకం కాదని, అయితే పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న కాలనీలు, రైతుల భూములను 22ఏ పరిధిలోకి తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్పొరేట్ సంస్థలు, భూస్వాములకు ప్రయోజనం కలిగేలా కాకుండా పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితా నుంచి భూములను తొలగించి వేల ఎకరాలను ఆ పార్టీకి చెందిన కుటుంబాలకు అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేవాదాయ భూముల విషయంలోనూ అక్రమాలు జరిగాయని, వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న చిన్నచిన్న కాలనీలు, వ్యవసాయదారుల భూములను 22ఏ పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర రావు, సుభాషిణి, రమేష్ బాబు, సవీందర్, కత్తి తమోదనరావు, కొత్త నరసింహ గౌడ్, శ్రవణ్, అప్పలనాయుడు, జయశ్రీ, జయమ్మ, సాంబశివరావు, రఘు రాజ్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, ఆగిశెట్టి బాలరాజు, కొండల్ రెడ్డి, మహమ్మద్ ఆజాం, నాగేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా వినాయక ఉత్సవాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి

- వినాయక వేడుకలపై పోలీసుల నిఘా గణపతి ఊరేగింపుకు భద్రతా కవచం.
- మండపాల వద్ద నిరంతర నిఘా నిబంధనలు పాటించాలలి
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా .



**వికారాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, జిల్లాలో శాంతిభద్రతలు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా ఏర్పాటు చేసేందుకు ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నారు. వినాయక మండపాల వివరాలను అధికారిక ఆన్‌లైన్ ఇంటిమేషన్ ఫారం ద్వారా నమోదు చేసుకోవాలని, మండపాల వద్ద తగిన బారికేడింగ్, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు కల్పించుకోవాలని ఎస్పీ సూచించారు. విద్యుత్ వైర్లు, షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ఊరేగింపులకు నిర్దేశించిన మార్గాల్లోనే వెళ్లాలని, పోలీసుల సూచనలు లేకుండా మార్గాలను మార్చకూడదు అని తెలిపారు. డీజేలు, అధిక శబ్దానికి కారణమయ్యే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, నిమజ్జన సమయంలో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. పిల్లలు, ఈత రాని వ్యక్తులు నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్, ట్రాఫిక్, ఇతర శాఖల సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వికారాబాద్ పట్టణంలోని వేంకటేశ్వర కాలనీ, శివాజీ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సందర్శించి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్న ఆమె, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.

శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీఎస్‌బీ అధికారులు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూర్ డీఎస్పీ ఎన్.యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## మైసిగండిలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

- 120 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ
- గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కార్యక్రమం



**కడ్తాల్ సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జటావత్ ప్రేమ జోహార్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మధుల, డాక్టర్ లింగం సారథ్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 120 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా షుగర్, బీపీ, కంటి పరీక్షలతో పాటు జలుబు, దగ్గు, జ్వరం, శరీర నొప్పులు, బలహీనత తదితర సాధారణ ఆరోగ్య సమస్యలను వైద్యులు పరిశీలించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు మందులను పూర్తిగా ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు దోహదపడతాయని వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జటావత్ ప్రేమ జోహార్ లాల్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అనే సంకల్పంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలకు అవసరమైన వైద్య సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేస్తాం అని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన కామినేని ఆసుపత్రి ఎల్బీనగర్ వైద్య బృందానికి సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సహకరించిన ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కేతావత్ హిరాసింగ్, గ్రామ కార్యదర్శి జంగయ్య, కామినేని ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సందీప్, స్థానిక నాయకులు సుమన్, బాబూలాల్, చందన్, సక్రి, తులసిరాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల హెచ్82 జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**వికారాబాద్ సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ హెచ్-82 వికారాబాద్ జిల్లా నూతన జిల్లా, డివిజన్ కమిటీలను బుధవారం వికారాబాద్ పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజీఎస్పీడీసీఎల్ , కంపెనీ యూనియన్ సెక్రటరీ కె. వెంకటేష్, కంపెనీ జాయింట్ సెక్రటరీ ఎం.డి. జమీల్, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యుత్ రంగ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని నాయకులు పేర్కొన్నారు. రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ నిరంతర విద్యుత్ సరఫరాలో కీలక సేవలు అంది స్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలు, హక్కుల సాధన కోసం యూనియన్ తరపున నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సుభాన్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, వికారా బాద్ డివిజన్ అధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కృష్ణలను ఎన్నుకు న్నారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం



**హైదరాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కిరణ్ కుమార్ సంగం కు సూచించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్ సంగం మాట్లాడుతూ. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, సీనియర్ నాయకుడు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొని కిరణ్ కుమార్ సంగంకు అభినందనలు తెలిపారు.

### దబ్బండి టిఫిన్స్‌ను ప్రారంభించిన మాజీ చైర్మన్ నరేందర్



**మణికొండ, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి చేతుల మీదుగా దబ్బండి టిఫిన్స్‌ను బుధ వారం ప్రారంభించారు. మణికొండ పరిసర ప్రాంతాల ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన టిఫిన్స్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దబ్బండి టిఫిన్స్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల టిఫిన్స్‌ను పరిశుభ్రమైన వాతావరణంలో అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. నాణ్యత, రుచి, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, దబ్బండి టిఫిన్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో అభిమానులు, కార్యకర్తల భారీ జనసందోహం నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. సర్వమత ప్రార్థనలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఇదే రోజు దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం కూడా కావడంతో ప్రధానికి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మరొక కేక్‌ను కట్ చేశారు.

**ప్రధాని ఆయురారోగ్యాలతో ఉండాలి :** వేడుకల్లో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "దేశాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలుపుతున్న ఉక్కుమనిషి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 'ఆయుష్మాన్ భవ' అని ప్రతి ఒక్కరూ ఆశీస్సులు అందజేయాలి. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరో 25 ఏళ్ల పాటు దేశాన్ని ఆయనే పరిపాలించాలని కోరుకుంటున్నాను. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని (ముఖ్యమంత్రిగా, ప్రధానిగా) పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు జరిగే సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు తదితర పలు సేవా కార్యక్రమాలను చేపట్టనుంది" అని తెలిపారు.. ప్రజానీకం అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనే ధ్యేయం:** దేశ ప్రధాని ఆకాంక్షించిన 'వికసిత్ భారత్ 2047', ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాలను సాధించడమే మన అందరి ప్రధాన ధ్యేయమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. తనకు మంత్రి పదవిని కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, తనను విశ్వసించి గెలిపించిన నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు, అలాగే ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించిన అభిమానులు, జనసేన-కూటమి కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**భారీ బైక్ ర్యాలీ - నీరాజనాలు పట్టిన ప్రజలు:** అంతకుముందు విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు వేలాది మంది అభిమానులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా కారు పై నిలబడి దాదాపు 10 కిలోమీటర్ల మేర ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రి దుర్గేష్ నిడదవోలు పట్టణంలోకి ప్రవేశించారు. మార్గమధ్యంలో అభిమానులు, ప్రజలు గజమాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక ఆళ్ల నాని



- **ఆళ్ల నాని కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటాం**
- **ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన మంత్రి నారా లోకేష్**

**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ఒక మంచి వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) పార్థివదేహానికి మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. గురువారం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేష్.. ఆళ్ల నాని పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "ఆళ్ల నాని మృతి బాధాకరం. ఆంధ్ర రాష్ట్రం ఒక మంచి వ్యక్తిని కోల్పోయింది. నాని అన్న మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నాను. సభలో అనేక అంశాలపై ఆయనతో చర్చించేవాడిని. అయితే ఏనాడూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లకుండా హుందాతనంగా ఆయన వ్యవహరించేవారు" అని లోకేష్ తెలిపారు.

"రాజకీయాల్లో రాజనీతి ఉండాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆళ్ల నాని అన్న. వ్యక్తిగత దూషణలకు ఆయన ఎప్పుడూ దూరంగా ఉండేవారు, ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజల సమస్యల గురించి మాట్లాడేందుకే ఉపయోగించాలనే భావనతో ఆయన ఉండేవారు" అని చెప్పారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు జరుగుతున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి అక్కడే ఉండి అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ తరపున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకటరాజు, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏపీ భవన నిర్మాణ, ఇతర నిర్మాణాల కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులు

- **పరిటాలవారిపాలెం, ఉప్పలపాడు, జరుగులవారిపాలెం, నాగభైరవునిపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు**
- **సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత: డా. పెమ్మసాని చంద్రశేఖర్**





**గుంటూరు, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నామని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

పెదనందిపాడు మండలంలోని పరిటాలవారిపాలెం, ఉప్పలపాడు, జరుగులవారిపాలెం, నాగభైరవునిపాలెం గ్రామాల్లో గురువారం పర్యటించిన పెమ్మసాని చంద్రశేఖర్ సుమారు రూ. 3 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. పరిటాలవారిపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభించి, ప్రధాన డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉప్పలపాడులో ఆర్అండ్‌బీ రోడ్డును ప్రారంభించారు. జరుగులవారిపాలెంలో గ్రామ చెరువు, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. నాగభైరవునిపాలెంలో రోడ్‌షోలో పాల్గొని నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు బహిరంగ సభలో పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు ఏళ్లుగా కోరుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, పంచాయతీ భవనాలు, చెరువుల అభివృద్ధి వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. గత రెండేళ్లుగా ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి గ్రామాల్లో రూ.3 నుంచి రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మూడు ప్రధాన గ్రామాల్లో ఒక్కో గ్రామానికి సుమారు రూ. 50 లక్షల చొప్పున చెరువులను ఆధునీకరించి కమ్యూనిటీ ప్రదేశాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పిల్లలు, పెద్దలు వినియోగించుకునేలా వాటిని తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గుంటూరు ఛానల్ భూసేకరణలో దాదాపు 90 శాతం పూర్తయిందని, పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలో సుమారు రూ. 100 కోట్లతో ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ప్రజల నుంచి అదనపు పెన్షన్లు, ఇళ్ల కోసం విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రానికి తొలుత కేటాయించిన ఇళ్లకు అదనంగా మరో 2.25 లక్షల ఇళ్లు సాధించడంతో మొత్తం 3 లక్షల ఇళ్లు కేటాయించబడ్డాయని చెప్పారు. ప్రత్తిపాడు, గుంటూరు పార్లమెంట్ పరిధికి సాధ్యమైనంత ఎక్కువ ఇళ్లను తీసుకురావడానికి కృషి చేశామని తెలిపారు. స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రాబోయే 10-15 రోజుల్లో ఇళ్ల మంజూరు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థలం లేని అర్హులైన పేదలకు భూమిని సేకరించి ఇళ్ల స్థలాలు అందించాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు త్వరలో చర్యలు చేపడతామని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును ఈ సందర్భంగా అభినందించారు.

# మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- **కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ వేతనం, రెండో దఫా క్రమబద్ధీకరణ చేపట్టాలి**
- **జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్**



**అమరావతి, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్):** మెడికల్ అండ్ హెల్త్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ హంస అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సిబ్బంది సమస్యలు, మెరుగైన వైద్య సదుపాయాలపై పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ అయ్యే వరకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని, 2013 జూలై తర్వాత నియమితులై పదేళ్ల సేవ పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రెండో దఫా క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరారు. స్టాఫ్ నర్స్ కేడర్‌ను 'నర్సింగ్ ఆఫీసర్'గా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను 'పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు'గా నామకరణం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, జిల్లా, జోన్ స్థాయిలో ఖాళీగా ఉన్న అన్ని కేడర్లలో పదోన్నతులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీఓ 143, జీఓ 32 కారణంగా మంజూరైన పోస్టులపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది నమూనాను పునఃపరిశీలించి సీనియర్ కేడర్ ఉద్యోగులకు నిలిచిపోయిన పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి ఆరోగ్యశ్రీ తరహాలో నగదు రహిత వైద్యం అందించాలని, ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించే ఆరోగ్య పథకం మొత్తాన్ని నేరుగా సంబంధిత ట్రస్టుకు మళ్లించే విధానాన్ని రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సందర్భాల్లో ఉద్యోగులకు ప్రత్యేక గదుల సదుపాయం కల్పించాలని కోరారు. ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న ఓటీపీ సమస్యను పరిష్కరించి, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ, సమగ్ర సర్వే విధానం, అవసరమైన చోట ఇంటర్నెట్ లేకుండానే వివరాలు నమోదు చేసే సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించగలమని అరవ పాల్ పేర్కొన్నారు. సంయుక్త సిబ్బంది మండలి సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, వాటి అమలుకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ చేపట్టాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు, క్రమబద్ధీకరణ, పదోన్నతులు, ఆరోగ్య పథకం, ఏఎన్ఎంల సమస్యలు వంటి అంశాలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# సీపీఎస్ పదవీ విరమణ ఉద్యోగులకు వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలి

- **ఆరోగ్య పథకం లేదా బీమా ద్వారా నగదు రహిత వైద్యం అందించాలి**
- **సచివాలయ డిస్పెన్సరీలో వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి**
- **ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అధికారుల కమిటీ సమావేశం నిర్వహించాలి**
- **ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సీపీఎస్ కింద పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం లేదా బీమా విధానం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య చికిత్స అందించాలని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వీరపాండ్యన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త సిబ్బంది మండలి సమావేశంలో ఆరోగ్య శాఖ, ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య ట్రస్టు అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు ఆరోగ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డుల ద్వారా కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని రామకృష్ణ తెలిపారు. ఈహెచ్ఎస్ కార్డు కలిగిన ప్రతి ఉద్యోగి, పెన్షనర్, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమయంలో కచ్చితంగా వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య ప్రక్రియలకు అనుమతిస్తూ నగదు రహిత వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం లేదా బీమా విధానం ద్వారా నగదు రహిత వైద్య చికిత్స అందించే విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఏపీ సచివాలయ డిస్పెన్సరీలో అవసరమైన వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.

తీవ్ర అనారోగ్యాలకు ఇతర రాష్ట్రాల్లో చికిత్స కోసం అత్యవసర అనుమతి పత్రాలు మంజూరు చేస్తున్నప్పటికీ, అక్కడి ఆసుపత్రులు వాటిని అంగీకరించని పరిస్థితి ఉందని రామకృష్ణ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలతో తగిన ఒప్పందాలు చేసుకుని, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లోనూ ఈహెచ్ఎస్ ద్వారా వైద్యం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆంధ్రప్రదేశ్ ఈహెచ్ఎస్ కార్డులు అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన వివిధ సమస్యలపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అధికారుల కమిటీ సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని రామకృష్ణ కోరారు.

# మచిలీపట్నం పోర్టు వద్ద ఘనంగా 'ఆశీర్వాద దీపోత్సవం'



**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మచిలీపట్నం పోర్టు వద్ద 'ఆశీర్వాద దీపోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ దీపాలు వెలిగించారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మోదీ చేస్తున్న కృషి కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# మంగళగిరి ఎయిమ్స్‌లో 'ఆశీర్వాద దీపోత్సవం'



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళగిరి ఎయిమ్స్‌లో 'ఆశీర్వాద దీపోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ పాల్గొని దీపాలు వెలిగించారు. ప్రధానమంత్రి మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాద దీపోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

# బిఫోర్ మోదీ - ఆఫ్టర్ మోదీగా భారతదేశ రూపురేఖలు మారాయి

- **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, "బిఫోర్ మోదీ - ఆఫ్టర్ మోదీ" అని చెప్పుకునేంతగా భారతదేశ రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ 18వ డివిజన్‌లోని భారత మాత విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు ఆధ్వర్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై, భారత మాత విగ్రహానికి నివాళులర్పించి మోదీ చిత్రపటానికి పూలమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీని కేవలం ఒక ప్రధానమంత్రిగా మాత్రమే కాకుండా భారతదేశానికి స్ఫూర్తినిచ్చే మహోన్నత వ్యక్తిగా గుర్తుంచుకోవాలని, అత్యంత సాధారణ కుటుంబం నుంచి దేశ అత్యున్నత పదవికి చేరుకోవడం వెనుక ఆయన కృషి, క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నో కష్టనష్టాలను అధిగమించి దేశ ప్రజల ఆశయాలను అర్థం చేసుకుంటూ ముందుకు సాగిన నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు. భారతదేశ యువత ఆశయాలు, ప్రజల అవసరాలను గుర్తించి సంస్కరణల దిశగా దేశాన్ని నడిపించిన నాయకుడు మోదీయేనని పేర్కొన్నారు. సుపరిపాలనతో పాటు మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిచ్చే నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు.

ఒక మహిళా ప్రజాప్రతినిధిగా అలాంటి గొప్ప ప్రధానమంత్రి నాయకత్వంలో పనిచేయడం గర్వకారణమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ప్రపంచ పటంలో భారతదేశాన్ని మరింత ప్రతిష్టాత్మక స్థానంలో నిలిపేందుకు మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని, భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ఆకాంక్షించారు.

రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు సహజమే అయినప్పటికీ రాజకీయాలకు అతీతంగా వ్యక్తిత్వం, విలువలు, సూత్రాలతో ప్రజలకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు నరేంద్ర మోదీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన జీవితం, సిద్ధాంతాలు యువతకు స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ మరెన్నో పుట్టినరోజులు ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావుతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అలాగే మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 18వ డివిజన్‌లో నారదాసు మణి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు టీ స్టాళ్ల వద్ద ప్రజలకు ఉచితంగా టీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఒకప్పుడు "చాయ్ వాలా"గా జీవితాన్ని ప్రారంభించి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన మోదీ జీవితానికి స్ఫూర్తిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమని పేర్కొంటూ, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

# నర్సింగ్ పల్లిగ్రామం లో వైభవంగా 'ఇందిరమ్మ ఇల్లు' భూమిపూజ

**సిరికొండ, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రజాప్రభుత్వంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయమని, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరుగుతోందని గ్రామ సర్పంచ్ శ్రీమతి తెడ్డు సుగుణ రాజేశ్వర్ తెలిపారు.సిరికొండ మండలం నర్సింగ్ పల్లి గ్రామానికి చెందిన కైతా దీన గారికి, రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ భూపతి రెడ్డి గారి ప్రత్యేక కృషితో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ సందర్భంగా బుధవారం రోజున గ్రామ సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ గారి ఆధ్వర్యంలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి సాంప్రదాయబద్ధంగా ముగ్గు పోసి (భూమిపూజ చేసి) పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు శ్రీ కైతా దీన మరియు వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... తమలాంటి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, అలాగే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇల్లు మంజూరు చేయించిన



ఎమ్మెల్యే శ్రీ భూపతి రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రావణకుమార్, పంచాయతీ కార్యదర్శి పాషా, బి.ఎల్.ఓ (BLO) నవీన్, గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిరికొండ 1వ వార్డులో నూతన సిసి మురికి కాలువ నిర్మాణానికి భూమిపూజ



**సిరికొండ, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిరికొండ మండల కేంద్రంలోని 1వ వార్డులో నూతనంగా నిర్మించనున్న సిసి (CC) మురికి కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ మల్లెల సాయి చరణ్ శంకుస్థాపన (భూమిపూజ) చేశారు. వార్డు ప్రజల డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వార్డు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. వార్డుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడమే తమ మొదటి లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యామ శోబన్, గ్రామ కార్యదర్శి వినిల్, జీపీఓ మాణిక్యం, వార్డు సభ్యులు యెల్లయ్య, అశ్విని, లత, మురళి, సునీత, రంజిత్, అమృత, తిరుపతిలతో పాటు కరబార్ ప్రవీణ్, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి

- మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం

**మేడ్చెల్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించి, అర్హత కలిగిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు బుధవారం మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి యజమానులు క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు తదితర వ్యవహారాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను సంబంధిత అధికారులు పరిశీలించి, అర్హత ఉన్న భూములపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న భూ సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఒకేసారి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. భూ రికార్డులను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం అర్హత కలిగిన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో



తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహ, అరవింద్ కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంటరీ అధ్యక్షుడు కందికంటి అశోక్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుంకర వెంకటేష్, మల్కాజిగిరి పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యులు కరణం గోపి, చంద్రశేఖర్, రామకృష్ణ, తెలుగు యువత జనరల్ సెక్రటరీ నరేష్ ముదిరాజు, జవహర్‌నగర్ అధ్యక్షుడు నామాల సురేష్, వెంకటరమణ, దమ్మాయిగూడ అధ్యక్షుడు కృష్ణారావు, నాగారం అధ్యక్షుడు కొండ జంగారెడ్డి, నాయకులు నాగరాజు, తండాలపల్లి శంకర్, కాప్రా సీనియర్ నాయకుడు రాములు యాదవ్, తెలుగు మహిళా నాయకురాలు ఆశాబిందు, ఉమాశంకర్ గౌడ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హాకీ అకాడమీకి తూంపల్లి విద్యార్థుల ఎంపిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల అభినందనలు

**సిరికొండ, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**

సిరికొండ మండల పరిధిలోని తూంపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు తమ క్రీడా ప్రతిభతో రాష్ట్ర స్థాయి SATS (తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) హాకీ అకాడమీకి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నగేష్ బుధవారం తెలిపారు.అకాడమీకి ఎంపికైన వారిలో బుఖ్య జలజ, బొల్లబోయిన జశ్వంత్, బాదావత్ చికిత, బుఖ్య అఖిల, బోడా రూపిక ఉన్నారు. వీరు కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శనకు గాను రాష్ట్ర స్థాయి అకాడమీలో శిక్షణ పొందే అవకాశాన్ని దక్కించుకున్నారని పీఈటీ తెలిపారు.రాష్ట్ర స్థాయికి ఎంపికై గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను సర్పంచ్ రాజేందర్, ఎంఈఓ రాములు, హాకీ అసోసియేషన్ ప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత




శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఏల్గొండగూడలో ఘనంగా మహాగణపతి పూజ



**షాబాద్, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** షాబాద్ మండలంలోని ఏల్గొండగూడ గ్రామంలో మహాగణపతి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని స్వామివారిని ప్రార్థించారు.అలాగే 'సర్వేజనా సుఖినోభవంతు' అనే ఆకాంక్షతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ పూజా కార్యక్రమంలో శ్రీనివాసచారి, మల్లారెడ్డి, ఆంజనేయులు గౌడ్, కృష్ణమాచారి, బలరాం, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రామడుగు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ధర్పల్లి, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**




ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోలం రాజేశ్వర్, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దున్నే వాడికి భూమి వెట్టి చాకిరి విముక్తికై -సాయుధ రైతాంగ పోరాటం

- సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 17 (జర్నలిస్ట్ ఫైల్) :**



బుధవారం యాచారం మండలంలోని మేడిపల్లి గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం ,అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు స్తూపాలకి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ హాజరై మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామాల్లో దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అని అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మేడిపల్లి గ్రామంలో కూడా ఉన్న దొరల భూస్వాముల దోపిడీ దౌర్జన్యానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా గ్రామంలో ఉన్న భూములు దున్నేవానికే భూములు దక్కాలని కామ్రేడ్ కృష్ణమూర్తి నాయకత్వాన జరిగిన పోరాటంలో కామ్రేడ్ వడ్డేమోని సత్తయ్య బూరె మల్లయ్య ఆలంపల్లి ఎల్లయ్య గడ్డం మల్లయ్య గడ్డం చెన్నయ్య ఎర్రజెండా రాములు బోడ మల్లయ్య పివిష్ణుమూర్తికర్నాటి రంగారెడ్డి కీలక పాత్ర పోషించారు.తెలంగాణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన 4,500 మంది తమ ప్రాణాలు అర్పించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని అన్నారు 3,000 గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పడిందని అన్నారు అదేవిధంగా 10 లక్షల ఎకరాలు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఏ సంబంధం లేని బిజెపి పార్టీ చరిత్రను వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వక్రీకరించే విధంగా ప్రయత్నం చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గ్రామంలో యువత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య ,ఎస్ ,చందు నాయక్ మండల కమిటీ సభ్యులు ,ముచ్చర్ల లాజర్ ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి ,వి భూషణ్ శాఖ కార్యదర్శిలు ,ఆలంపల్లి యాదయ్య, గడ్డం కుమార్, ఆలంపల్లి పెంటయ్య ,9వ వార్డు సభ్యులు అల్లంపల్లి మహేష్ సిపిఎం నాయకులు మల్లయ్య,వేణు,దేవయ్య ,యాదయ్య,నరసింహ ,ఎండి బాషీద్ ,గఫూర్ శ్రీకాంత్ ,రాజు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో మెరుగైన సేవలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగర పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్ల ద్వారా పేదలు, దినసరి కూలీలకు రూ. 5కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. క్యాంటీన్లలో సేవలు, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే జీఎంసీ కాల్ సెంటర్ 08632345103కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి అన్న క్యాంటీన్ నిర్వహణను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జీఎంసీ నుంచి 22 మంది క్షేత్రస్థాయి సిబ్బందిని, వారి సమన్వయానికి ఉపా సెల్ పీఓను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. అధికారులు ప్రతిరోజూ క్యాంటీన్లను సందర్శించి ఆహార నాణ్యత, రుచి, సరఫరా సమయాలు, ప్రాంగణ పరిశుభ్రతను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఆహార పంపిణీలో లోపాలు తలెత్తకుండా సిబ్బందికి సూచనలు ఇవ్వడంతో పాటు ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని వెల్లడించారు. క్యాంటీన్లలో పారిశుద్ధ్యానికి ఎలాంటి రాజీ ఉండదని మయూర్ అశోక్ స్పష్టం చేశారు. భోజనం చేసే ప్రాంతాలు, తాగునీటి ప్రదేశాలు, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి క్రిమిరహితంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. ఎండలు, అకాల వర్షాల సమయంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి క్యాంటీన్ ఆవరణలో తగినంత నీడ ఉండేలా షెడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, దినసరి కూలీలు ప్రశాంతంగా కూర్చుని భోజనం చేసేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పేదలకు తక్కువ ధరకే ఆకలి తీర్చడంతో పాటు పరిశుభ్రమైన, గౌరవప్రదమైన వాతావరణంలో ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా జీఎంసీ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ, పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

### ‘సేవా సంకల్ప్ అభియాన్’ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డా. వినోద్ కుమార్



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** ‘సేవా సంకల్ప్ అభియాన్’లో భాగంగా బాపట్ల జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పలు ప్రజా సేవా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్, ఐ.ఏ.ఎస్. గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలలో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, వ్యాధుల నివారణ మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ అభియాన్ కింద పలు ఆరోగ్య సేవలు అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలు, అసాంక్రమిక వ్యాధుల (ఎన్ సి డి ) స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు కంటి పరీక్షలు, రక్తదానంపై అవగాహన, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, చిన్నపాటి ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని అధికారులు కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. విజయమ్మతో పాటు పలువురు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తహసిల్దార్ కార్యాలయం ఎదుట మహిళ బైటాయింపు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** తాను డబ్బు పెట్టి కొన్న స్థలాన్ని ఇతరులు కబ్జా చేస్తున్నారు అంటూ ఓ మహిళ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించింది. వివరాలు లోకి వెళితే మండల కేంద్రంలోని 1428 సర్వే నెంబర్లు నందు మండలంలోని లక్ష్మీదేవి అనే మహిళ ఇతరుల వద్ద 10 సెంట్లు ఇంటి స్థలాన్ని కొను కొనుక్కున్నానని అయితే నా స్థలమంటూ మరో వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నారని మహిళ కార్యాలయం ఎదుట బైటాయించింది. రెవెన్యూ అధికారులు నాకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

# ముస్లిం విద్యార్థుల భవితకు భరోసానిస్తాం

- సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం
- మైనారిటీ రిజర్వేషన్లు పక్కాగా అమలవ్వాలి
- ఏ సమస్య వచ్చినా మైనారిటీలకు అండగా నిలుస్తాం
- అనంతపురంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీని సందర్శించిన అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్
- స్థానిక నేతలతో కలిసి వర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి
- ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ
- విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ముస్లిం మైనారిటీ ముస్లిం మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే తమ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీని గురువారం స్థానిక ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, మైనారిటీ అధికారులతో కలిసి అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ సందర్శించారు. తొలుత యూనివర్సిటీలోని విద్యార్థులు, లెక్చరర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో మైనారిటీ రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తున్నారా ? మైనారిటీస్ పథకాలు అందుతున్నాయా ? అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పిస్తున్నారా ? ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు తాము అండగా నిలుస్తామని, ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ , రిజిస్ట్రార్ లను కలిశారు. మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు సక్రమంగా వచ్చేలా చూడాలని కోరారు. బీసీ–ఈ రిజర్వేషన్లు పక్కాగా అమలు కావాలన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గార్లదిన్నె గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

హాస్టల్లో విద్యా బోధన, వసతి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులు, ప్రభుత్వ పరంగా అందుతున్న సదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యనూ స్థానిక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. తొలుత అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ను స్థానిక రాజకీయ పార్టీ నాయకులు, మైనారిటీ సంఘాల నేతలు వచ్చి కలిశారు. కూటమి ప్రభుత్వంలో మైనారిటీలకు అందుతున్న ప్రయోజనాల గురించి చర్చించారు.

# మహిళల చేత స్థాపించి.. మహిళల చేతనే వినాయక నిమజ్జనం

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి నిమజ్జనం కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఈ ఏడాది ప్రత్యేకంగా మహిళల చేత వినాయకుడిని స్థాపించి, మహిళల చేతనే నిమజ్జనం చేసే విధంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేశామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ఘనంగా ప్రారంభించారు. నిమజ్జన వాహనానికి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వయంగా నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్రీ వినాయక చవితి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పూజలు ముగిసిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని కార్యాలయం నుంచి ప్రారంభించి బుడంపాడు కాలువ వరకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు.

సాధారణంగా వినాయక చవితి వేడుకలు యువతతో ముడిపడి ఉంటాయని, అయితే మహిళల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది మరింత మంది మహిళలతో రెట్టింపు ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

వినాయకుడు సిద్ధి, బుద్ధి ప్రదాత అని, ఆయన ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సద్బుద్ధితో, సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా ప్రతి శుభకార్యానికి ముందు ఆయనను పూజించడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. చిన్నారులకు జ్ఞానాన్ని బోధించే దేవుడిగా, యువతకు భక్తి, ఉత్సాహాలకు ప్రతీకగా వినాయకుడు నిలిచారని అన్నారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని జరుపుకునే పండుగ వినాయక చవితి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఈ వేడుకలను ప్రారంభించడం ఆనందంగా ఉందని, కార్యక్రమానికి హాజరైన మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



**కొల్లిపర (గుంటూరు జిల్లా), (జర్నలిస్ట్ ఫైల్ ):** దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. కొల్లిపరలో గురువారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయుటకు, వాటి పట్ల అవగాహన కల్పించుటకు ఇది ఒక మంచి వేదిక అన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వం వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించుటకు అవకాశం కలుగుతుందన్నారు. నియోజక వర్గం స్థాయిలోనే నెలకు నాలుగు సార్లు అధికారులు సందర్శించడం వలన ప్రజలు స్థానికంగానే అర్జీల పరిష్కారం వివరాలు సైతం తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రజల అర్జీలకు వారి సమక్షంలోనే నాణ్యమైన పరిష్కారం కూడా లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించడమే కాకుండా సంబంధిత శాఖల అధికారులు నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలను జిల్లా కలెక్టర్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, ఆర్.టి.ఓ కె శ్రీహరి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె పార్థసారథి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్.రమేష్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తెనాలి నియోజకవర్గ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాలు ఆదర్శంగా నిలవాలి

- భక్తి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించి ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలపాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఉత్సవాలు కేవలం వినోదానికి పరిమితం కాకుండా భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామాజిక ఐక్యతను చాటేలా ఉండాలన్నారు. యువతతో పెద్దలు స్నేహపూర్వకంగా మమేకమై వారికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. డీజేలకు బదులు సంప్రదాయ కళారూపాలను ప్రోత్సహించాలని, అధిక శబ్దంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగంపై ఉన్న నిబంధనలను పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. “పండుగ భక్తిని చాటాలి.. డీజే శబ్దాన్ని కాదు” అని ఎస్పీ పేర్కొన్నారు.

నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉత్సవ కమిటీలు పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుగానే మార్గాలను ప్రణాళిక చేసుకోవాలని ఎస్పీ సూచించారు. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ప్రతి గణేష్ విగ్రహం సాయంత్రం 5 గంటలలోపు ప్రధాన రహదారికి చేరుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించే సంప్రదాయం ఉందని, ప్రజా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బందోబస్తు కోసం అవసరమైన ప్రాంతాలకు అదనపు పోలీసు బలగాలను పంపినట్లు తెలిపారు. పోలీసుల సూచనలకు ఉత్సవ కమిటీలు పూర్తి సహకారం అందించి గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు.

## ఓటరు జాబితా సవరణ నిర్దిష్ట సమయంలో పూర్తి కావాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఓటరు జాబితా సవరణ నిర్దిష్ట సమయంలో పూర్తి కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్నారు. జాబితా సవరణ తదితర అంశాలపై గురువారం జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులు, ఫోటోల నాణ్యత, ఫోటోల అనుసంధానంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 30వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పక్కాగా విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు.

జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ జిల్లాలో ఎస్.ఐ.ఆర్ క్రింద చేపడుతున్న విచారణలు, ఫారం 6, 7, 8 పై చేపడుతున్న చర్యలు వివరించారు.

## రోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి




- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్. విజయమ్మ

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో రోగి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. విజయమ్మ మాట్లాడుతూ ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలతో పాటు సురక్షితమైన వైద్య సేవలు అందించడమే ఆరోగ్య శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. రోగి భద్రత అనేది కేవలం ఒక్కరి బాధ్యత కాదని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఫార్మసిస్టులు, ల్యాబ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఇతర సహాయక సిబ్బంది అందరి సమష్టి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. వైద్య సేవలందిస్తున్న సమయంలో సరైన రోగిని గుర్తించడం, సరైన మందును సరైన మోతాదులో ఇవ్వడం, మందుల వినియోగంలో పొరపాట్లను నివారించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలు పాటించడం, చేతుల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల సక్రమ నిర్వహణ, వైద్య ప్రక్రియల్లో కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించడం అత్యంత కీలకమని డా. విజయమ్మ వెల్లడించారు. అత్యవసర సమయాల్లో రోగులకు సకాలంలో వైద్యం అందించడం, వైద్య వివరాలను పక్కాగా నమోదు చేయడం, రోగి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమాచారం అందించడం ద్వారా భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఎక్కడైనా వైద్య సేవల సమయంలో పొరపాట్లు జరిగితే వాటిని దాచిపెట్టకుండా, కారణాలు విశ్లేషించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవడం ద్వారా సేవలను మెరుగుపరచవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. “ప్రతి రోగిని మన కుటుంబ సభ్యుడిగా భావించి, గౌరవంతో, బాధ్యతతో మరియు భద్రతతో కూడిన వైద్య సేవలు అందిద్దాం” అని ఆరోగ్య సిబ్బందికి ఆమె పిలుపునిచ్చారు. “రోగి భద్రతే మన ప్రథమ కర్తవ్యం -- సురక్షితమైన వైద్య సేవలే మన లక్ష్యం” అనే నినాదంతో ప్రతి ఆరోగ్య సంస్థలోనూ భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయాలని డా. ఎస్. విజయమ్మ సూచించారు.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

- మండలంలో రూ.2.60 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్
- గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. గురువారం బ్రహ్మంగారిమఠం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే సుమారు రూ. 2.60కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన స్మశాన వాటికలు, RO ప్లాంట్లు, సీసీ రోడ్లు, పాఠశాల కాంపౌండ్ వాల్, మినీ గోకులం తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

### 9 గ్రామాల్లో స్మశాన వాటికలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకులగుంట హరిజనవాడ, డి.అగ్రహారం, పెద్దిరాజుపల్లె, చౌదరివారిపల్లె కొత్తపల్లె, ముదుమాల బ్రహ్మంగారిమఠం టౌన్ రాజుపేట, సోమిరెడ్డిపల్లె గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 9 స్మశాన వాటికలను ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారు ప్రారంభించారు.

ఒక్కో స్మశాన వాటిక నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున నిధులు వెచ్చించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో భాగంగా స్మశాన వాటికలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

### రెండు RO ప్లాంట్లు ప్రారంభం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో డి ఎం ఎఫ్ నిధులు రూ. 13 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు RO ప్లాంట్లను కూడా ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. వాంపల్లి చెరువు, రాజుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ RO ప్లాంట్ల ద్వారా స్థానిక ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి రానుంది. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల తాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

### రాజుపేటలో పలు అభివృద్ధి పనులు

రాజుపేట గ్రామంలో కూడా పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలోని రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. అదేవిధంగా రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన రాజుపేట పాఠశాల కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. పాఠశాల పరిసరాలను సురక్షితంగా ఆహ్లాదకరంగా ఉంచేందుకు కాంపౌండ్ వాల్ ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే రూ. 2.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినీ గోకులంను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. పశు పోషకులకు గ్రామీణ రైతులకు మద్దతుగా అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ని కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఇళ్ల కేటాయింపు, పింఛన్లు, విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు టీడీపీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# దివ్యాంగుడైన విద్యార్థికి ట్రై సైకిల్ అందజేసిన మంత్రి కందుల దుర్గేష్



○ పుట్టినరోజున ఆపన్నహస్తం

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్ ):** : పుట్టినరోజు వేడుకలంటే సాధారణంగా ఆర్భాటాలు, వేడుకలే కనిపిస్తాయి. కానీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తన పుట్టినరోజును సార్థకం చేసుకుంటూ మరోసారి తనలోని సహృదయతను, మానవత్వాన్ని చాటుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పీయూష్ అనే దివ్యాంగ విద్యార్థి పడుతున్న ఆవేదనను, నిత్యం ఎదుర్కొంటున్న శ్రమను గుర్తించిన మంత్రి దుర్గేష్ తన మిత్రుని సహకారంతో ఆ విద్యార్థికి ఒక ట్రై సైకిల్‌ను మంజూరు చేసి స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడూ... “శారీరక వైకల్యం అనేది విద్యార్థి ఆశయాలకు ఏమాత్రం అడ్డంకి కాకూడదు. ఈ వాహనం పీయూష్‌కి కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు... అతని ఆత్మవిశ్వాసానికి, నిత్య జీవిత చక్రానికి కొండంత ధైర్యం. పీయూష్ మరింత కష్టపడి చదివి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి”అని ఆకాంక్షించారు. మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ట్రై సైకిల్ అందుకున్న విద్యార్థి పీయూష్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నిత్యం కాలేజీకి వెళ్లడానికి, రోజువారీ పనులకు పడుతున్న అవస్థలను గుర్తుచేసుకుంటూ”నా కష్టాన్ని గుర్తించి, నా చదువుకు కొత్త ఊపిరి పోసిన మంత్రి దుర్గేష్ రుణం తీర్చుకోలేను. ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు” అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడమే నిజమైన పుట్టినరోజు పండుగ అని నిరూపించిన మంత్రి దుర్గేష్‌ను, ఈ సత్కార్యానికి సహకరించిన వారిని పలువురు నెటిజన్లు, స్థానికులు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.

# రోమ్ టోర్ వెర్గాటా యూనివర్సిటీతో ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంవోయూ



○ ప్రపంచ పరిశోధనా రంగంలో మరింత విస్తృతంగా అడుగులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రపంచస్థాయి పరిశోధనా రంగంలో తన పరిధిని మరింత విస్తరించుకుంటూ ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మరో కీలక ముందడుగు వేసింది. ఇటలీలోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ ఆఫ్ రోమ్ టోర్ వెర్గాటాతో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ గురువారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. యూనివర్సిటీలో గురువారం మధ్యాహ్నం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరు విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్‌డిసిప్లినరీ రీసెర్చ్ చొరవతో ప్రారంభమైన ఈ భాగస్వామ్యం ద్వారా ఇరు విశ్వవిద్యాలయాలు సంయుక్త పరిశోధనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నాయి. పరిశోధనా పత్రాలను సంయుక్తంగా ప్రచురించడం, ఉమ్మడి ప్రయోగశాలలను ఏర్పాటు చేయడం, అధ్యాపకులు, విద్యార్థుల పరస్పర మార్పిడి వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ఇప్పటికే కొనసాగుతున్న ఇరు సంస్థల పరిచయాన్ని మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో విస్తృతమైన విద్యా, పరిశోధనా సహకారానికి ఈ భాగస్వామ్యం మార్గం సుగమం చేయనుంది. ఈ అవగాహన ఒప్పంద పత్రాలను ఎస్ఆర్ఎం యూనివర్సిటీ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ సెల్ అసోసియేట్ డీన్ డాక్టర్ వినోద్ కుమార్, యూనివర్సిటీ ఆఫ్ రోమ్ టోర్ వెర్గాటా ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ కొరాడో డి నటాలే పరస్పరం మార్చుకున్నారు.

ఈ సందర్భంగా ఇటలీ నుంచి వచ్చిన ప్రొఫెసర్ కొరాడో డి నటాలేకు ఎస్ఆర్ఎం ఏపీ ప్రతినిధులు యూనివర్సిటీ ప్రస్థానం, విద్యా కార్యక్రమాలు, పరిశోధనా సామర్థ్యాలు, వివిధ రంగాల్లో చేపడుతున్న పరిశోధనల గురించి వివరించారు. అదేవిధంగా ప్రొఫెసర్ కొరాడో డి నటాలే టోర్ వెర్గాటా యూనివర్సిటీ పరిశోధనా కార్యకలాపాలు, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన ప్రగతి, ఇరు సంస్థల భాగస్వామ్యం ద్వారా అందుబాటులోకి రానున్న అవకాశాల గురించి వివరించారు. ఎంవోయూ అనంతరం నిర్వహించిన ఫ్యాకల్టీ ఇంటరాక్షన్ కార్యక్రమంలో ప్రొఫెసర్ కొరాడో డి నటాలే ఎస్ఆర్ఎం వర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్‌డిసిప్లినరీ రీసెర్చ్‌కు చెందిన పరిశోధకులతో సమావేశమయ్యారు. ఇరు సంస్థల మధ్య భవిష్యత్‌లో చేపట్టనున్న సంయుక్త పరిశోధనా కార్యక్రమాలు, పరస్పర సహకారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంగళంపల్లి కిరణ్‌తో పాటు పలువురు ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

# రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యా విధానాల అమలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను తెలుసుకునేందుకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి తక్షణమే సమన్వయ సమావేశం నిర్వహించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు కోరారు. ఇకపై ప్రతి నెలా నిర్దిష్టంగా రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి 2024 మధ్య విద్యాశాఖ మంత్రుల స్థాయిలో దాదాపు 30 సమన్వయ సమావేశాలు నిర్వహించగా, వాటిలో 10కి పైగా సమావేశాలకు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించిన సందర్భాలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో కొనసాగిన సంప్రదింపుల విధానాన్ని పునరుద్ధరించి, రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలకు సమన్వయ సమావేశాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ విద్యా విధానాల అమలులో ఎదురయ్యే క్షేత్రస్థాయి ఇబ్బందులను నేరుగా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘాలతో క్రమబద్ధమైన సంప్రదింపులు అవసరమని పేర్కొన్నారు. సమస్యలు పేరుకుపోయిన తర్వాత సమావేశాలు నిర్వహించే విధానానికి బదులుగా ప్రతి నెలా ఒక నిర్దిష్ట రోజున సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. దగత సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై తీసుకున్న చర్యలను సమీక్షించడంతో పాటు కొత్త సమస్యలు, సూచనలపై చర్చించే విధంగా సమావేశాలను నిర్వహించాలని చీూా కోరింది. రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలకు ఆహ్వానం కల్పించి, నెలవారీ సమన్వయ సమావేశాలను క్రమబద్ధంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వం, విద్యాశాఖ, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# ఎన్డీఏ కూటమిలో విభేదాలకు తావులేదు : మంత్రి సత్యకుమార్ యాదవ్

○ మూడు పార్టీల మధ్య సమన్వయం పటిష్టం



**గన్నవరం (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఎన్డీఏ కూటమిలో ఎలాంటి విభేదాలూ లేవని స్పష్టం చేశారు. రాబోయే కాలంలోనూ కూటమి కలిసి పనిచేస్తుందని తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం సామాజిక ఆసుపత్రిలో వైద్య శిబిరం గురువారం ప్రారంభించిన సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు

**మూడు పార్టీల సమన్వయంతో పాలన :** ఎన్నికల్లో మూడు పార్టీలు ఉమ్మడి అజెండాతో ప్రజల ముందుకు వెళ్లాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వంలో భాగస్వాములుగా కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వం దీర్ఘకాలం కలిసి పనిచేయాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 15, 20 ఏళ్ల పాటు కూటమి కొనసాగాలనే ఆలోచన ఉందన్నారు. కూటమిలోని ప్రతి పార్టీకి తనదైన బాధ్యత ఉందని, పరస్పర సమన్వయంతో రాష్ట్ర ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేస్తున్నామని చెప్పారు. కూటమిలో ఎప్పుడు విభేదాలు వస్తాయో అని జగన్మోహన్ రెడ్డి గోతికాడ గుంటనక్కలా ఎదురుచూస్తున్నారని ఎద్దేవా చేశారు

**జనసేనకు కీలక పాత్ర :** ఎన్డీఏ కూటమిలో జనసేన కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై మూడు పార్టీలు కలిసి దృష్టి సారించాయని చెప్పారు.

**చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి :** డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రంలో అనేక ప్రతిష్ఠాత్మక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. విజయవాడలో ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి, ఎయిమ్స్ ఏర్పాటు, అమరావతికి ఆర్థిక సహకారం, పోలవరం ప్రాజెక్టు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో రహదారి, రవాణా అనుసంధానం విస్తరిస్తోందని, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.

**'డీఎస్సీ'పై ఆధారాలతో చర్చకు సిద్ధం :** డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆరోపణలు చేయడం కాకుండా, ఏ అంశంపై అభ్యంతరం ఉందో స్పష్టంగా చెప్పి ఆధారాలు చూపించాలని సూచించారు.

'డీఎస్సీ'పై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని, అసెంబ్లీ వేదికగా వాస్తవాలను చర్చించేందుకు కూడా సిద్ధమని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఆధారాలతో చర్చకు రావాలని పలుమార్లు స్పష్టం చేశారని చెప్పారు. చర్చకు అవకాశం ఉన్నప్పుడు సభలో గందరగోళం సృష్టించడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు.

డీఎస్సీ నియామకాలకు సంబంధించి ఎవరి వద్దైనా ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టి చర్చకు రావాలని స్పష్టం చేశారు. వైసీపీ చేస్తున్న అక్రమాలు, అవినీతి ఆరోపణలకు కూడా ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని మంత్రి అన్నారు. వాస్తవాలపై ఆధారాలతో చర్చ జరిగితే ప్రజలకు విషయాలు స్పష్టంగా తెలుస్తాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

# ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి

○ ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ఎలక్ట్రిక్ బస్సులు వద్దు.. ఆర్టీసీయే కొనుగోలు చేసి నిర్వహించాలి: పలిశెట్టి దామోదరరావు

**ఒంగోలు(జర్నలిస్ట్ ఫైల్ ):** ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం జారీ చేసిన సర్క్యులర్ 01/2019ను కచ్చితంగా అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. సర్క్యులర్‌కు విరుద్ధంగా గతంలో ఉద్యోగులకు విధించిన శిక్షలను సమీక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ విస్తృతస్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం ఒంగోలులోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు పిడుగు వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దామోదరరావు మాట్లాడుతూ ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా 1,450 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే విధానాన్ని విరమించుకుని, అవసరమైన బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి సిబ్బందితో నిర్వహించాలని కోరారు. విద్యుత్ బస్సుల ప్రవేశం నేపథ్యంలో మూసివేసిన విద్యాధరపురం, గుంటూరు–2, నెల్లూరు–2, మంగళం డిపోలను ఆరు నెలల్లో పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీ మేరకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులను భర్తీ చేయాలని, స్త్రీశక్తి పథకం కారణంగా పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కనీసం 4 వేల కొత్త బస్సులను సమకూర్చాలని కోరారు. పదోన్నతులపై ఫ్రీజింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన ఉద్యోగులకు ఖాళీ పోస్టుల్లో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమం అనంతరం ప్రభుత్వం రెండు డీఏల విడుదలకు నిర్ణయించడం పట్ల దామోదరరావు స్పందిస్తూ, ఉద్యోగులు ఎదురుచూస్తున్న ఐఆర్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు కోరారు. డిసెంబర్‌లో జరగనున్న సీసీఎస్ ఎన్నికల్లో వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేసి యూనియన్ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి వాకా రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.నారాయణ, సహాయ కార్యదర్శులు సి. హెచ్.స్వరూపారాణి, పసుపులేటి చిరంజీవి, జోనల్ అధ్యక్షుడు బెజవాడ రవి, రెండు జిల్లాల నాయకులు, ఎనిమిది డిపోల ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు సహా సుమారు 450 మంది పాల్గొన్నారు.

# మదనపల్లిలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రక్తదాన శిబిరం



○ రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**మదనపల్లి(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, ప్రజా సేవకు అంకితమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ‘సేవా సంకల్ప్ అభియాన్’ లో భాగంగా మదనపల్లిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన ప్రతి రక్తదాతకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తమ విలువైన రక్తాన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా అందిస్తున్న సేవలకు గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలకు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ఆశీర్వాద దీపోత్సవం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ‘ఆశీర్వాద దీపోత్సవం’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి దీపాలు వెలిగించారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఆశీర్వాద దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధులు షేక్ బాజీ, చైతన్య శర్మ, రత్నకుమారి, హేమంత్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అంతర్జాతీయ స్థాయి విద్యే వీఐటీ యూనివర్సిటీ లక్ష్యం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** : అందరికీ అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడంతో పాటు, రేపటి ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలతో కూడిన యువతను తీర్చిదిద్దడమే వీఐటీ విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యమని యూనివర్సిటీ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈఏపీసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించి వీఐటీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.









ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిన వెంటనే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. విశ్వవిద్యాలయంపై వారు ఉంచిన నమ్మకం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. వీఐటీలో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యార్థులు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, విలువలు, నైతికతతో కూడిన విద్యార్థులుగా ఎదిగేందుకు విశ్వవిద్యాలయం అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తుందని తెలిపారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభను చాటుకునేందుకు వీఐటీ విశ్వవిద్యాలయం విస్తృత అవకాశాలను కల్పిస్తోందన్నారు. కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ మామిళ్లపల్లి శ్రీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వారి కృషి, పట్టుదల కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కెరీర్, ఉపాధి, ఉన్నత విద్య అవసరాలను పరిగణనలోకి తీసుకుని కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ పనిచేస్తుందని తెలిపారు. విద్యను నైపుణ్యంగా మలచడంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రిటికల్ థింకింగ్, విలువలను పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని చెప్పారు.

కార్యక్రమంలో ప్రో–ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్, సీఎఫ్ఓ సూర్యదేవర బదరీప్రసాద్, రిజిస్ట్రార్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ ఫ్రెష్‌మన్ ఎం.వి. రఘురామ్, డీన్ ఏఎస్‌బీ సీహెచ్. ఉదయ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

○ అధికారిక కమిటీని తక్షణమే సమావేశపరచాలి: బొప్పరాజు వెంకటేశ్వర్లు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా పూర్తిస్థాయి వైద్య సేవలు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు కోరారు. ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్లు చందాలు చెల్లిస్తున్నప్పటికీ అవసరమైన సమయంలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందకపోవడంతో సొంతంగా లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తాలు పూర్తిగా తిరిగి రాక ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాక్ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ అధ్యక్షతన నిర్వహించిన వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త సిబ్బంది మండలి తొలి సమావేశంలో వారు పలు సమస్యలను ప్రస్తావించారు.

గత పదేళ్లుగా ఉద్యోగుల ఆరోగ్య పథకం పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోతున్నారని బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. వైద్యం కోసం సొంతంగా ఖర్చు చేసిన మొత్తాలు పూర్తిగా తిరిగి రాక అనేక కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా పరిమిత పెన్షన్‌పై ఆధారపడే విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. 2025 అక్టోబరు 18న ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశం అనంతరం, 2025 డిసెంబరు 11న ప్రభుత్వం జీవో నంబరు 880 ద్వారా అధికారిక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ జనవరిలో ఒక్క సమావేశం మాత్రమే జరిగిందన్నారు. ఆ తర్వాత సమావేశాలు నిర్వహించకపోవడంతో ఆరోగ్య పథకానికి సంబంధించిన కీలక సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 2026 ఆగస్టు 5న ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో ఉద్యోగులు చెల్లించే మొత్తాలను నేరుగా ట్రస్టుకు జమ చేసే అంశంపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు.

వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న వైద్యులకు యూజీసీ వేతన సవరణ సంఘం--2016 ప్రకారం జనవరి 2016 నుంచి 2021 ఏప్రిల్ 1 వరకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యపరమైన అనర్హతకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఏడు వ్యాధులకు అదనంగా మరో ఐదు వ్యాధులను చేర్చాలని కమిటీ సిఫారసు చేసి ఏళ్లు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలోని అధికారిక కమిటీని తక్షణమే సమావేశపరచి ఆరోగ్య పథకం అమలులో ఉన్న అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆరోగ్య కార్డు చూపిస్తే అవసరమైన వైద్యం పూర్తిస్థాయిలో అందేలా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. శాశ్వత సంయుక్త సిబ్బంది మండలిలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగ సంఘాలను తాజా సమావేశానికి ఆహ్వానించకపోవడం సరికాదని, భవిష్యత్ సమావేశాలకు తప్పనిసరిగా ఆహ్వానించి 60 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించాలని బొప్పరాజు కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467